భూ పరిరక్షణకు ప్రత్యేక వ్యూహం!

ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆరా | పైలెట్ ప్రాజెక్టు కింద భూ సర్వేకు సన్నద్ధం | అన్యాక్రాంతమైన ప్రభుత్వ, అసైన్డ్ భూముల గుర్తింపునకు రెవెన్యూ శాఖ చర్యలు | క్షేత్ర స్థాయిలో వీఆర్ఓ, వీఏఓలు లేకపోవటంతో తప్పని ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతోంది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా నిలిచి వాటి అక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే వీఆర్ఓ, వీఏఓల వ్యవస్థలను గత ప్రభుత్వం తప్పించిన విషయం విదితమే. ఆ వ్యవస్థలను సంబంధిత శాఖ నుంచి తప్పించి ఇతర శాఖల్లో సర్దుబాటు చేయటంతో భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఓ సవాల్‌గా మారిందనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలోనే భూముల పరిరక్షణకు పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే నిర్వహించి, సాంకేతికంగా కిహోల్ మార్కప్ లాంగ్వేజ్ (కేఎంఎల్) మ్యాప్ (గూగుల్)లో పొందుపరిచేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

మండలాల వారీగా భూముల గుర్తింపు ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే భూ పరిరక్షణకు జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిల్లో సర్వే నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. అలాగే ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలపై కూడా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందని పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీలు, ఫెన్సింగ్ వంటి రక్షణ చర్యల అవశ్యకతపై కూడా దృష్టి సారిస్తోంది.

కబ్జాదారుల కబంద హస్తాల్లో...

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది. ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందనే సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది.

- రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.
- శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.

కోర్టుల్లో వివాదాల కేసులు ఇలా...

మేడ్చల్ జిల్లాలో భూసంబంధిత కోర్టు కేసులు 706 ఉండగా ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుప్రీం కోర్టులో ఒకటి కాగా, హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్ కోర్టులో ఆరు కేసులు కొనసాగుతున్నాయి. అలాగే కోర్టు ధిక్కారంలో 35 ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డుల బట్టి తెలుస్తోంది.

అసైన్డ్ భూములెక్కువనే...

జిల్లాలో 2004వ సంవత్సరానికి ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు.

- ఈ అసైన్డ్ భూములన్నీ వ్యవసాయ పంట సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు ఉంది.
- మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. ఇందులో చాలా మేరకు వెంచర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

వివాదంలో చిక్కిన భూములివే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్ కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న భూములు 2,485 ఎకరాలు కాగా, రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది.

- ఇతర వివాదాలతోపాటు ఎండోమెంట్, వక్ఫ్, పారెస్టు, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ పేర్కొంటున్నది. అసైన్డ్ భూముల కేటాయింపుల్లో భాగంగా 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నాయి.
- జిల్లాలో 5,837 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాల లెక్క తేలగా, మిగతా 6,236 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాలను రెవెన్యూ శాఖ గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.
- జిల్లాలో లెక్క తేలిన 5,837 ఎకరాల భూ వివాదాలకు సంబంధించి మండలాల వారీగా ఇలా ఉన్నాయి. శామీర్‌పేట్ ఉమ్మడి మండలంలో 2,189 ఎకరాల భూములు వివాదంలో ఉండగా, ఇందులో షారెస్టుకు సంబంధించి 629 ఎకరాలు, ఎండోమెంట్‌కు సంబంధించి 1560 ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- మేడ్చల్ మండలంలో 1500 ఎకరాలు, ఘట్‌కేసర్
- మండలంలో 1000 ఎకరాలు, కీసర మండంలో 500 ఎకరాలు, మేడిపల్లి మండలంలో 460 ఎకరాలు, కాప్రా మండలంలో 69 ఎకరాలు, దుండిగల్ మండలంలో 70, ఉప్పల్ మండలంలో 50 ఎకరాల భూములు వివాదంలో ఉన్నట్లు తెలుస్తోంది.

వైభవంగా రంగనాయక స్వామి చక్రతీర్థం



ఎదులాబాద్‌లో స్వామిఅమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీ గోదాసమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యవిధి, మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన , ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం, గాంధోళి ఉత్సవం, చక్రతీర్థం తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని, స్వామివారిని పల్లకిలో గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ప్రకృతి పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పద్మమ్మ, విద్యార్థులు

ఘట్‌కేసర్: పచ్చదనం పెరగాలంటే ప్రకృతి పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక అన్నారు. అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఇబ్రహీంపట్నం మహిళ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

డాక్టరేట్ ప్రదానం

బోడుప్పల్: బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డికి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం యూనివర్సిటీ చైర్మన్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసేవలు ఉత్తమ సేవలు అందించినందుకు డాక్టరేట్ అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న మల్లారెడ్డి

మేడ్చల్: సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల వారికి మంజూరైన రూ. 3 లక్షల నిధులకు సంబంధించిన చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన నివాసంలో అందజేశారు. మేడ్చల్ మండలం ఘనాపూర్ తండాకు చెందిన శేఖర్ బాబు కు రూ. 30 వేలు, కోనాయిపల్లికి చెందిన పెంటయ్యకు రూ. 28,500, శామీర్‌పేట్ మండలం అలియాబాద్‌కు చెందిన రాములు కు రూ. 40 వేలు, కీసరకు చెందిన చరణ్‌తేజకు రూ. 18 వేలు, నాగారంకు చెందిన శివకుమార్‌కు రూ. 38,500 మంజూరైంది. దీంతో ఆ చెక్కులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, దయానంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కాలనీల్లో వసతుల కల్పనకు కృషి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం నారపల్లిలోని శివాజీనగర్‌లో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొత్త కాలనీలతో మున్సిపాలిటీ శరవేగంగా విస్తరిస్తోందన్నారు. దశలవారీగా నూతన కాలనీలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. సీసీ రోడ్డు పనులను రూ. 10 లక్షల నిధులతో చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ సుర్వి రవీందర్, కోఆప్షన్ సభ్యుడు అక్రమ్ అలీ, ఏఈ మహిపాల్, కాలనీ నేతలు ఫాతిమా, రవికుమార్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం

కీసర: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రతి శనివారం భక్తులకు చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ అన్నారు. శనివారం మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేవస్థానానికి తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చే కార్యక్రమం ఎంతో పుణ్యకార్యమని పేర్కొన్నారు. భక్తులు అన్న ప్రసాదవితరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఎంఆర్‌సీఈలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మేడ్చల్‌రరూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎంఆర్‌సీ) 2005–2023 వరకు చదివిన విద్యార్థులు శనివారం అల్యూమి మీట్ (సమ్మేళనం) నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు హాజరై అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వివిధ రంగాల్లో ఉన్న తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రెడ్డి, కుమార్, డీన్‌లు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లోని ఆల్ఫోర్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీని స్థానిక నారాయణ గార్డెన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తల్లితండ్రులు, అధ్యాపకులు చూపిన మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వ్యవనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

స్పాట్ లోన్ క్లాడ్ టెక్నిక్ పేరుతో టోకరా

ఘట్‌కేసర్: గ్రూపులో చేరితే లాభం వస్తుందనే ప్రకటనతో నమ్మించి డబ్బులు తీసుకొని ముఖం చాటేసిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఘట్‌కేసర్‌కు చెందిన సైనోజీ మనోహర(46) అనే మహిళ పీఆర్ఎం ప్రసాద్ ద్వారా స్పాట్ లోన్ క్లాడ్ టెక్నిక్‌లో చేరింది. సభ్యులను గ్రూపులో (గొలుసు) చేర్పిస్తే లాభం వస్తుందని తెలపడంతో రూ. 1600 వందలు చెల్లించి సభ్యత్వం తీసుకుంది. అనంతరం రూ. 3200 చెల్లించి మరో రెండు గుర్తింపు కార్డులు తీసుకుంది. అలాగే మరో ఏడుగురిని గ్రూపులో చేర్పించింది. వారితో రూ. 12 వేలు డిపాజిట్ చేయించి గుర్తింపు కార్డులు ఇప్పించింది. ఇచ్చిన మాట ప్రకారం కంపెనీ లాభం ఇవ్వకపోవడంతో వారిని నిలదీసింది. దీంతో నిందితులు ప్రసాద్, పావని, ప్రశాంత్ ఆమె మానసిక సమస్యలో బాధపడుతుందని గ్రూపులో ప్రచారం చేశారు. డబ్బులు అడిగితే వారు ముఖం చాటేయడంతో కంపెనీ పేరుతో డబ్బును సేకరించి సభ్యులను మోసం చేసిందని గమనించి సదరు కంపెనీపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలాగే దేశంలో సుమారు 10 లక్షల మందిని కంపెనీ మోసం చేసిందని ఫిర్యాదులో తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎండీ కాకుమాను క్రాంతికుమార్, కొండవీటి సాయి ప్రశాంత్, నారిశెట్టి పావని, పీఆర్ఎం ప్రసాద్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ కళాశాల ముందు విద్యార్థులు ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వివరాలివీ... స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అరుణ్‌కుమార్ గురువారం తరగతి గదిలో పరీక్ష రాస్తూ ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో తోటి విద్యార్థులు కళాశాల అధ్యాపకులకు విషయం తెలియజేగా వారు యాజమాన్యానికి సమాచారం చేరవేయగా అంబులెన్స్ చేరుకుని విద్యార్థిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు విద్యార్థి మృతి చెందినట్లు తెలిపారు. విద్యార్థి అరుణ్‌కుమార్ కిందపడిన వెంటనే యాజమాన్యం స్పందించి త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్తే ప్రాణాలు దక్కేవని విద్యార్థులు ఆరోపించారు. విద్యార్థి మృతికి సంతాపంగా యాజమాన్యం శుక్రవారం కళాశాలకు సెలవు ప్రకటించగా శనివారం పునః ప్రారంభమైంది. అధ్యాపకులు, యాజమాన్యం అలసత్వంతో విద్యార్థి మృతి చెందాడని ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాలతో కలిసి విద్యార్థులు శనివారం ఉదయం కళాశాల ముందు ఆందోళన నిర్వహించారు. యాజమాన్యం స్పందించకపోవడంతో కళాశాలలోని ఫర్నిచర్ దహనం చేసి, అద్దాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కళాశాలకు చేరుకుని ఆందోళనకారును అదుపు చేశారు. చివరకు యూనివర్సిటీ వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రీతిరెడ్డి, వైస్ చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులతో మాట్లాడారు. అలసత్వం వహించిన అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కళాశాల విద్యార్థి మరణం పట్ల యాజమాన్యం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. యూనివర్సిటీలో అన్ని కళాశాలలో అంబులెన్స్ సదుపాయం ఏర్పాటు చేస్తామని ప్రీతిరెడ్డి తెలిపారు.

'స్వచ్ఛ'త మిథ్యేనా?



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్త



దూదికానా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద

మేడ్చల్: ఇంటి పరిసరాలు, వీధులు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో నిర్వహించిన స్వచ్ఛదనం ఫలితం మేడ్చల్‌లో కనిపించడం లేదు. కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహించడంతో ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తున్నది. మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మినీ డంపింగ్ యార్డు తయారు చేసి అక్కడ చెత్త యథేచ్ఛగా పేరుకుపోయినా తొలగించవారే కరువయ్యారు. మండల ప్రధాన అధికారి కార్యాలయం ఎదుటే చెత్త కుప్పలు ఇలా ఉంటే కార్యక్రమం ఎంత విజయవంతంగా నిర్వహించారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కార్యాలయ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్ర వెనుక భాగాన చెత్త పేరుకుపోయినా పట్టించుకునే వారు లేకుండా పోయారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



ఘట్‌కేసర్‌కు చేరుకున్న ఉద్యమకారుల ఫోరం ర్యాలీ

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అల్వాల్ నుంచి ఘట్‌కేసర్ వరకు పాదయాత్ర చేశారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ముగించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఉద్యమకారులను కనీసమైనా గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు.

ఘట్‌కేసర్ పీఎస్‌ను సందర్శించిన డీపీఎస్ విద్యార్థులు



విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ సైదులు

ఘట్‌కేసర్: పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రైమరీ విద్యార్థులు ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వాహణ, పోలీసుల విధులు, ఆయుధాల వినియోగం, నిందితులపై కేసు నమోదు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సైదులు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



దివ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పద్మమ్మ

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలో అంకుషాపూర్‌లోని ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల్ మహిళా డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్.దివ్య తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పద్మమ్మ ఆమెను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యుదాఘాతానికి గేదె బలి

ఘట్‌కేసర్: విద్యుదాఘాతంతో ఓ గేదె మరణించింది. వివరాలివీ... వెంకిర్యాల్‌కు చెందిన గడగొట్టి వెంకటేశ్ అనే వ్యక్తి మాదారం సర్వే నంబర్ 225లో పశువులను మేపుతున్నాడు. ఈ క్రమంలో పశువులు మేస్తున్న ప్రదేశంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తాకడంతో ఓ గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె మృతితో రూ. లక్షన్నర నష్టం వాటిల్లిందని, తగు విచారణ చేయాలని బాధితుడు 100 డయల్ చేశాడు. పశు వైద్యురాలు పద్మిని, విద్యుత్ ఏఈకి సతీశ్‌కు సమాచారమిచ్చి సంఘటనపై విచారణ చేయాలని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయ శాశ్వత చైర్మన్ దంపతులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలోని రమాసహిత సత్యనారాయణ స్వామి, షిరిడీ సాయిబాబా, అభయాంజనేయ స్వామి, పోచమ్మ ఆలయాల షోడశదశ (16వ వార్షికోత్సవ) ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయంలో అభయాంజనేయ స్వామికి విశేష అభిషేకం, మండల పూజలు, స్థాపిత దేవతా హవనం, అష్టోత్తర మృతిక కలశాభిషేకాలు, మధ్యాహ్న హారతి, తీర్థప్రసాద వితరణ, దేవతా హోమాలు, మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమలను పండితులు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, లావణ్య దంపతులు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాల పంపిణీని ప్రారంభిస్తున్న బీజేపీ నేత వెంకట్‌రెడ్డి

కీసర: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన కీసరలో సుమారు 500 మందికి జాతీయ జెండాలను పంపిణీ చేయనున్నట్లు బీజేపీ కీసర మండల నాయకుడు నల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం కీసరలోని పోస్టాఫీస్ వద్ద జాతీయ జెండా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... ఆగస్టు 15న ప్రతిఒక్కరూ జాతీయజెండా ఎగురవేయాలన్నారు. ఎవరైనా తమను సంప్రదిస్తే వారికి జాతీయ జెండాలను ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని వివిధ కాలనీ అసోషియేషన్ సభ్యులు, యుజవజన సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నేతలు కేసరి ప్రకాష్‌చారి, అన్నోజుగూడ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు



అద్రాసపల్లిలో బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి బోనాల పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. బోనాలను పసుపు, కుంకుమ, వేపాకులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామంలో నుంచి అమ్మవారి ఆలయం వరకు డప్పు చప్పళ్లతో శివసత్తుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లారు. బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అద్రాస్‌పల్లిలో...

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామంలో బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంమైంది. శనివారం గ్రామస్తులు పెద్దమ్మతల్లి అమ్మవారికి బోనాలను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల శిగాలు, డప్పుచప్పుల మధ్య బోనాలు కోలాహలంగా జరిగాయి.



బోనాలతో వస్తున్న భక్తులు